
మంచిగంధపు పరిమళం. అగరువత్తుల ఘుమాయింపు. మల్లెల సౌరభం. పచ్చి తాటాకుల వింత వాసన.

మామిడి తోరణాలు. మంగళ వాయిద్యాలు. వెన్నెల కన్నె తీర్చిదిద్దిన వెండి ముగ్గులు. వెలతురు పువ్వుల లేలేత నవ్వులు. పట్టు చీరల రెపరెపలు. కన్నె పిల్లల హృదయాల్లో మ్రోగుతున్న సన్నాయి నాదాలు. నుదుటి కల్యాణ తిలకం, చెక్కిట చుక్క. కళ్ళల్లో కలల హరివిల్లులు- విచిత్రమైన స్పందనను కలిగిస్తూంది వాతావరణం.

# ఒంటరి నక్షత్రం

ఆలూరి విజయలక్ష్మి




హృదయంలో విరబూస్తున్న మధుర భావాలు శారద చెక్కిళ్ళలో ప్రతిఫలిస్తున్నాయి. పురోహితుడు చెప్తున్నట్లు పూజ చేస్తూ మధ్య మధ్యలో సిగ్గుగా స్నేహితురాళ్ళ వంక చూస్తూంది.

అప్పటివరకు బొంగరంలా ఇంట్లోకి, బయటికి తిరుగుతూ అన్నీ అందించిన అరుంధతి పందిరి గుంజకు ఆనుకుని కూతురివంక ప్రేమగా, తన్మయంగా చూస్తూంది. నిన్న మొన్నటి ప్రాకుల పాపాయి ఇంతై ఇంతింతై, చీరసింగారించి యిప్పుడు నవవధువై గౌరీపూజ చేస్తూంది. చిలిపినవ్వుల కొంటె అల్లరుల అమ్మాయి సిగ్గుల మొగ్గయి క్రీగంట చూస్తూంది.

కల్యాణ ఘడియవస్తే ఆగదంటారందుకే యింత త్వరగా, యింత తేలికగా కూతురి పెళ్ళి నిశ్చయమవుతుందని అనుకోని అరుంధతి ఆనందాన్ని యిముడ్చుకోలేకపోతూంది శారద బంగారు బొమ్మే అయినా, రిసెర్చి స్కాలరయినా కట్నం ప్రసక్తి లేకుండా ఆమెకు మనసిచ్చిన వాడు, ఆమెక్కు నచ్చిన వాడయిన వ్యక్తితో పెళ్ళి జరగడం- అదీ వధువు గుణగణాలతో, విద్యాసంపదతో నిమిత్తం లేకుండా కట్నాలివ్వక తప్పనిసరయిన పరిస్థితులలో యింతసుళువుగా జరిగిపోవడం ఆమెకు ఓ అద్భుతంలా కనిపిస్తూంది. డబ్బుతో ముడిపడ్డ యీ లోకంలో యింక ఒంటరిగాపోరాడే ఓపిక మిగలేదు తనకు. ఒంటరిగా అవును తను ఒంటరిదే.... కొండంత విషాదం కారు మేఘంలా చుట్టేసింది.

* * *

ఆనాటి కలలు కళ్ళ ముందు కదలాడుతున్నాయి. రెండెకరాల రైతు కలలోకూడా అనుకోలేనికోరికల్ని కోరుకుంది అరుంధతి తన ముగ్గురు బిడ్డలకీ పెద్దపెద్ద చదువులు చెప్పించాలని కలలు కంది.... కాదు .. పంతం పట్టింది. అది నెగ్గించుకోవడానికి గాను కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర లేకుండా శ్రమించింది. అరడజను గేదెల్ని, ఇరవై కోళ్ళను పెట్టుకుని పైసా పైసా కూడబెట్టి చలపతి రఘుల చదువుకు ఖర్చుపెట్టింది. వాళ్ళు శ్రద్ధగా చదువుతూ ఒక్కొక్క మెట్టే పైకి ఎక్కుతున్న కొద్దీ తమ శ్రమ ఫలిస్తూందని మురిసిపోయేవారు అరుంధతి. ఆమె భర్త చక్రపాణి ముగ్గురిలోకి

చిన్నది శారదకూడా పైచదువుకు వచ్చే సరికి అంతరికీ డబ్బు పంపడానికి ఇబ్బంది అయేది. అలాంటి సమయాల్లో దేవతలా ఆదుకునేది ప్రక్కింటి నారమ్మాయి కమల ఇంట్లో చెప్పి, చెప్పకుండా వండ. ఏదైవంపుతూ వుండేది చలపతికి. అవసరం అంతరాత్మను జోకొడుతున్నా, అస్వతంత్రురాలయిన ఆడపిల్ల అందిస్తున్న సహాయాన్ని అంగీకరించడానికి మన సొప్పేది కాదు

"ఏమిటత్తయ్యా నీ మొహమాటం! మా యింట్లో నాకామాత్రం స్వతంత్రం వుంది. ఈ డబ్బు గురించి నేనెవరికీ సంజాయిషీ చెప్పాల్సిన అవసరంలేదు. నేను కష్టపడి పెంచిన మల్లె పొదల పూల మ్మగా వచ్చిన డబ్బిది. మల్లెపూలంత పవిత్రమయిందీ డబ్బు" బొడ్డుమల్లె పూవులా స్వచ్ఛంగానవ్వుతూ అరుంధతిని ఒప్పించడానికి ప్రయత్నించేది కమల. కమల అంతగా చెప్తున్నా సరిపెట్టుకోలేకపోయేది అరుంధతి.

"కేవలం అందం కోసమో, సరదా కోసమో పూల మొక్కల్ని పెంచ గలిగే అదృష్టమెలానూలేదు మనకు. అమ్మగలిగిన వస్తువే ఒక్కటి దొరికినా అమ్ముకుంటే గాని గడవని బ్రతుకులు మనవి. అందుకే పది మందికీ పది దోసిళ్ళు పంచాల్సిన పువ్వుల్ని పది పావలాలకు అమ్ముతున్నాను. ఇది బావ చదువుకు ఉపయోగపడడం కంటే కావలసిందేముంద త్తయ్యా?" రక్తం పంచుకు పుట్టిన అన్నదమ్ములు, తోబుట్టువులు దేహీ అని చెయిచాచి అడిగినా మొహం చాటేసిన సమయంలో ఆ అమ్మాయి చూపుతున్న ఔదార్యానికి కన్నీళ్ళు తిరిగివచ్చాయి అరుంధతికి హృదయం మూగవోయి. మాటలు రాక కమల భుజంచుట్టూ చెయ్యేసి పొదువుకుని మౌనంగా కోటి ఆశీర్వాదాల్ని కురిపించింది.

కమల చలవవల్ల చలపతి ఏ ఆటంకం లేకుండా ఎమ్. ఏ. పూర్తిచేశాడు అప్పటికి కమల, చలపతి బాగా సన్నిహితమయ్యారు. అరుంధతికికూడా కమలను కోడల్ని చేసుకుంటే బావుంటుందనిపించేది తనంటేనూ, తన కొడుకంటేనూ ప్రాణంపెట్టే యీ పిల్ల తన యింటి దీపమవుతుంది. ఆమె చేతుల్లో తన చివరి రోజులు చల్లగా గడిచిపోతాయని తలపోసేది అరుంధతి.

అరుంధతి కమ్మటి ఆలోచనల్లో వుండగా ఉద్యోగ ప్రయత్నం కోసం వెళ్ళిన చలపతి ఓ క్రొత్తవార్తను మోసుకొచ్చాడు చలపతి ప్రొఫెసరొకాయన అమెరికాలో




బెజవాడ కనకదుర్గమ్మ

వుండేలా ఏర్పాటు చేసుకుని వెళ్ళిపోతూ కూతురికి పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టాడు. ఇటు చదువులోనూ, అటు ఆటలోనూ చురుగ్గా వుండే చలపతి ఆయన దృష్టి నాకర్షించాడు. ఒక లెక్చరర్ ద్వారా చలపతి దగ్గర పెళ్ళి ప్రస్తావన తెచ్చి అతన్ని ఒప్పించడానికి ప్రయత్నించారు

"నువ్వేమంటావమ్మా? మంచి అవకాశమిది. యిక్కడే ఏదో ఒక ఉద్యోగం దొరకొచ్చనుకో. ఐనా ఎక్కడవేసిన గొంగళి అక్కడేనన్నట్లు వుంటుంది బ్రతుకు. నేను అమెరికా వెళ్ళానంటే మన బ్రతుకుల స్వరూపమే మారిపోతుందమ్మా!" కొడుకు చెప్పేది విని నీరుకారిపోయింది అరుంధతి. ప్రొఫెసర్ కూతుర్ని చేసుకుని అమెరికా వెళ్ళేవాడు కమలనేం చేద్దామని!! కమల అనురాగాన్నీ, ఆమె చేసిన సాయాన్ని ఎంత త్వరగా మరిచిపోయాడు వీడు!! కమలను పెళ్ళి చేసుకుని స్వశక్తి వల్ల స్వంత ప్రతిభ వల్ల అతను అమెరికా వెళ్ళంటే తనంత అదృష్టవంతురాలు ప్రపంచంలో లేదని మురిసిపోయేది. కాని....

"ఇక్కడి సంవత్సరమంతా గొడ్డుచాకిరి చేసి సంపాదించే డబ్బుని అక్కడ ఒక్క నెలరోజుల్లో సంపాదించవచ్చు. రఘు, శారదల చదువుకోసం యింక నువ్వు, నాన్న యిలా అసమానం కష్టపడాల్సిన అవసరముండదు. మనం పేదవాళ్ళమని ఛీకొడుతున్న వాళ్ళముందు సగర్వంగా తలెత్తుకోవచ్చు. రఘుని, శారదనికూడా అమెరికా తీసుకువెళ్ళడానికి అవకాశముంటుంది." నిర్లిప్తంగా కొడుకు మాటలు వింటోంది అరుంధతి—వాడు చెప్పేవన్నీ నిజమేకావచ్చు. కాని మనిషికి కావలసింది డబ్బొక్కటేనా? డబ్బులేకపోతే బ్రతుకులో ఒక్క అడుగుకూడా ముందుకు పడదం లేదు. నిజమే. కాని చదువుకు ఏకైక లక్ష్యం సంపాదనేనా? బ్రతుకులోని మిగతా విలువలకు అర్థమేలేదా?

"ఏమిటమ్మా మాట్లాడవు? కమల గురించి ఆలోచిస్తున్నావా?" తను బయట పెట్టడానికి తటపటాయిస్తున్న విషయాన్ని అతనే ఎత్తడంతో ఆ తుతగా చూసింది అరుంధతి కమలని వీడు మరిచిపోలేదు. కమలని గురించి ఆలోచించాడకైనా తన లోని లోపాన్ని గుర్తిస్తాడు-ఆశగా అతని వంక చూసింది అరుంధతి.

"అమ్మా! వాగ్దానాలు, సెంటిమెంట్ల కాలం చెల్లిపోయింది. నిచ్చెన కనిపిస్తుంటే ఎక్కి పైకి చేరుకోవడం సమర్థుల లక్షణం. సెంటిమెంట్స్‌ని పట్టుకుని క్రిందే కూర్చుంటానని భీష్మించడం వెర్రితనం. కమల నా చదువుకు సహాయపడింది ఆవిడ యిచ్చిందానికి రెండింతలు అమెరికానుంచి పంపిస్తాను. సరేనా?" నిరకిగా. ప్రాణంలేనట్లు చూస్తోంది అరుంధతి. ఆడపిల్ల ప్రేమను కూడా డబ్బుతో తూచే దౌర్భాగ్యుడా! నీకు సెంటిమెంట్లు, వాగ్దానాలు అర్థంలేనివిగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. కమల పంపిన డబ్బుకు రెండింతలిస్తావు. ఆ అమ్మాయి నీ కిచ్చిన ధైర్యానికి, ప్రేమకు బదులేమిస్తావు?

అతని మాటల ధోరణిని బట్టి అతనో స్థిర నిశ్చయానికి వచ్చినట్లు, మరో ఆలోచనకు తావులేనట్లు కనిపించడంతో తను ఎంతవరకు కల్పించుకుని నచ్చచెప్పడానికి ప్రయత్నించవచ్చో అర్థంకాలేదు అరుంధతి గుంజాటనపడుతూనే కొడుకుకు యిష్టమైన వంటలు చేస్తోంది. అంతలో చలపతికి యిష్టమైన కోవాతో గులాబ్‌జామ్ చేసి తెచ్చింది కమల కమలవంక చూడడానికి మొహంచెల్లక వంటింట్లోనే వుండిపోయింది అరుంధతి. కొంచెంసేపుపోయాక కమల వంటింట్లోకి వచ్చింది.

"అత్తయ్యా! కూర తరగమంటావా?" పీట వాల్చుకుని కూర్చుంది కమల.

"నీకెందుకమ్మా శ్రమ? నేను చేసుకుంటాగా!" కమల ముఖంవంక సూటిగా చూడడానికి జంకుగావుండి పొయ్యివంక దీక్షగా చూస్తోంది. కాసేపు మౌనంగా అరుంధతిని చూస్తూ కూర్చుంది కమల.

"అత్తయ్యా ఎందుకంత బాధపడతావు? బావ నాతో విషయమంతా చెప్పాడు"

(తరువాయి పేజీ చూడండి)



చిత్రం, కూరామండ శ్రీనివాసరావు...